క్లుప్తంగా

పీఆర్ మినిస్టీరియల్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



హన్మకొండ : పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆవిష్కరించారు. వరంగల్ జిల్లా పర్వతగిరిలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని క్యాలెండర్, డైరీని శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని గుర్తుచేశారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు మరింతగా చేరవేయాలని వారికి సూచించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎ.నంద కుమార్, గౌరవ అధ్యక్షుడు జె.నాగరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్ జి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఖాజామొహినొద్దీన్, పి.అనంత్‌రావు, ట్రెజరర్, ఎం.రాజేశ్వర్‌రావు, జాయింట్ సెక్రటరీ జి.అనిల్‌కుమార్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి చాట్ల రవికుమార్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు జి.యుగేందర్, జనగామ జిల్లా అధ్యక్షుడు జి.విక్రమ్, మహబూబ్ జిల్లా అధ్యక్షుడు ఎం.సూర్య ప్రకాష్, నాయకులు రాజేందర్, అజయ్ కుమార్, మన్మోహన్ రెడ్డి, రమేష్ కుమార్, పి.అనంతరావు, రవికుమార్, మోజేస్, ప్రవీణ్‌కుమార్, విజయపాల్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, ఎ.వేణుగోపాల్, ఈక రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యంతో ఉజ్వల భవిష్యత్

మామునూరు: ఇంజనీరింగ్ విద్యార్థులు చదువుతోపాటు ఇంగ్లిష్ పరిజ్ఞానం, సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకుంటే ఉజ్వలమైన భవిష్యత్ సొంతమవుతుందని ఇన్ఫోసిస్ కంపెనీ ప్రోగ్రాం మేనేజర్ వీరమల్ల శ్రీధర్, వాగ్దేవి విద్యాసంస్థల అధిపతి చందుపట్ల దేవేందర్‌రెడ్డి అన్నారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంటలోని మహాలక్ష్మీ గార్డెన్‌లో వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల స్నాతకోత్సవం (గ్రాడ్యుయేషన్) డే వేడుకలు శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ ఎస్ఎస్‌వీఎన్.శర్మ, డైరెక్టర్ డాక్టర్ వాహినిదేవి, వాణిదేవి, ప్రసాద్‌రావు, తిరుపతిరావు, శశిధర్, సంతోష్, సత్యవతి, అయేషాభాను, తన్వీర్, నవీన్, జయ, కుమార్, వెంకటేశ్వర్లు, ఇంజనీరింగ్ విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేటి నుంచి యోగా శిక్షణ తరగతులు

హన్మకొండ: హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఈనెల 29నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రముఖ యోగా గురువు పోశాల శ్రీనివాస్ తెలిపారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం 6గంటల నుంచి 7గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని వివరించారు. ఆసక్తి గల వారు 93947 66001 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నిధులు కేటాయించాలి



ఖిలా వరంగల్: కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లలో విద్యారంగానికి భారీగా నిధులు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ల్యాదల్ల శరత్ డిమాండ్ చేశారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో విద్యారంగానికి ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం 10శాతం, రాష్ట్రం 30 శాతం నిధులు కేటాయించి విద్యారంగాన్ని బలోపేతం చేయాలని సూచించారు. సమావేశంలో నాయకులు శ్రీరామ్ ప్రశాంత్, రాము, కిషోర్, శివకుమార్, సోను, శ్రవణ్, రాకేష్ పాల్గొన్నారు.

పైపులైన్ పనులకు శంకుస్థాపన

కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్ పరిధిలోని డీజిల్‌కాలనీ చౌరస్తా నుంచి మెయిన్ రోడ్డు వరకు రూ.4 లక్షల జనరల్ ఫండ్ నిధులతో తాగునీటి నూతన పైపులైన్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ సంకు నర్సింగరావు శనివారం శంకుస్థాపన చేశారు. మున్సిపల్ ఏఈ పాక వెంకటేశ్వర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్ బండారి కోటి, బీఆర్ఎస్ నాయకులు కృష్ణ, జుబేర్, నరేష్, శంకర్, యాకూబ్ పాల్గొన్నారు.

భూములను కాపాడాలి

మడికొండ: 64వ డివిజన్ మడికొండలోని వేణుగోపాలస్వామి ఆలయ భూములను కాపాడాలని విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేసింది. ఈమేరకు ఆలయ భూములను విశ్వహిందూ పరిషత్ సభ్యులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ వరంగల్ మహానగర కార్యదర్శి శ్రీరాం ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ఆలయానికి సంబంధించిన భూములు అన్యాక్రాంతానికి గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

హరితహారానికి సన్నద్ధం

- ముమ్మరంగా బ్యాగ్ ఫిల్లింగ్ పనులు
- మండలంలో 2.5 లక్షల మొక్కలే లక్ష్యం
- ప్రణాళికలు సిద్ధం చేసిన అధికారులు



నెక్కొండ నర్సరీలో ప్లాస్టిక్ సంచులలో మట్టి నింపుతున్న కూలీలు

నెక్కొండ : పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనం పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హరితహారం కార్యక్రమం నిర్వహణ కోసం అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. తొమ్మిదో విడత హరితహారం కోసం అవసరమైన మొక్కల పెంపకానికి మండలంలో మట్టి సేకరణ, విత్తనాలు సేకరణపై అధికారులు దృష్టి పెడుతున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో హరితహారం కోసం ప్రతీ గ్రామ పంచాయతీలో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కల పెంపకం చేపడుతున్న విషయం విదితమే. మండలంలోని 39 గ్రామ పంచాయతీలలోని నర్సరీల నిర్వహణ పనులు వేగవంతం చేశారు. మండల వ్యాప్తంగా సుమారు అన్ని నర్సరీలలో 2.50 లక్షల మొక్కలు పెంపకానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

ప్రతీ నర్సరీలో 6వేల మొక్కల పెంపకం

గ్రామ పంచాయతీ నర్సరీలో 6వేల మొక్కలు పెంచే విధంగా సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా నర్సరీల్లో బెడ్‌ల ఏర్పాట్లు, ప్లాస్టిక్ కవర్లలో మట్టి నింపే పనులు చురుకుగా సాగుతున్నాయి. నర్సరీలకు విత్తనాలు కూడా సరఫరా చేశారు. ఈ మేరకు పండ్లు, పూల మొక్కలతో పాటు వృక్ష సంబంధిత టెంటోఫోరం, గుల్‌మోహర్, వేప, కానుగ, మునగ, టెకోమా, పండ్లజాతి మొక్కలు బొప్పాయి, జామ, నిమ్మ, నారింజ, నేరేడు, సీతాఫలంతో పాటుగా పూలజాతి మొక్కలు పెంచుతామని అధికారులు తెలిపారు.

మల్టీలేయర్ పద్ధతిలో పెంపకం

నర్సరీల్లో పెంచిన మొక్కలను హరితహారం కార్యక్రమంలో ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాలు, పరిశ్రమలు, దేవాలయాలు, కాల్వగట్లు, చెరువు గట్లపై, రోడ్లకు ఇరువైపులా మల్టీ లేయర్ అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టనున్నారు. నర్సరీల్లో పెంచిన మొక్కలను బృహత్ పల్లె ప్రకృతి వనాలకు, హరిత వనాలకు సరఫరా చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

ఉపాధి పొందుతున్న కూలీలు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా నర్సరీల్లో మొక్కల పెంపకంతో కూలీలు ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం కూలీలు బ్యాగ్ ఫిల్లింగ్ పనులు కొనసాగుతున్నాయి. ప్రతీ నర్సరీల్లో 8నుంచి 10మంది కూలీలు పనులు చేస్తున్నారు. కూలీకి రోజు రూ.250 వరకు ఉపాధిహామీ పథకం ద్వారా డబ్బులు చెల్లిస్తున్నారు.

జూన్ నాటికి మొక్కలు సిద్ధం



నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. గ్రామానికో నర్సరీ ఏర్పాటు చేసి వాటిలో 2.50 లక్షల మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ మేరకు నర్సరీల్లో పనులు ప్రారంభించాం. లక్ష్యం మేరకు మొక్కల పెంపకం చేసి జూన్ నాటికి మొక్కలు సిద్ధం చేసి ఉచితంగా అందజేస్తాం.

– వి. ప్రవీణ్‌కుమార్, ఎంపీడీఓ

శిక్షణతో మహిళలకు ఉపాధి

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే పెద్ది

నర్సంపేట : తెలంగాణ రాష్ట్ర భవన, ఇతర నిర్మాణ రంగ కార్మిక సంక్షేమ మండలి సౌజన్యంతో న్యాక్(నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్) స్కిల్‌డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలకు టెక్స్‌టైల్ పార్క్‌లో ఉపాధి అవకాశం కల్పించడం జరుగుతుందని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు న్యాక్ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో 90రోజుల పాటు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శనివారం కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. భవిష్యత్ తరాల కోసం ముందస్తు లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ టెక్స్‌టైల్ పార్క్‌ను సంగెం మండలంలో తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఇందులో నర్సంపేటలోని మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరామన్నారు. బ్యాచ్‌ల వారిగా ట్రైనింగ్ ఇచ్చి స్కిల్స్ ఉన్నటువంటి వారిని తయారు చేయడం జరిగిందన్నారు. అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీసీఎంఎస్ చైర్మన్ గుగులోత్ రామస్వామినాయక్, ఖానాపురం ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, న్యాక్ సంస్థ ఏడి డి.గోపాల్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ డిపార్ట్‌మెంట్ ప్రసాద్, న్యాక్ సిబ్బంది, ట్రైనర్ అనూష, ఇతర ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఆరోపణలు అవాస్తవం



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గీసుకొండ : మండలంలోని బొడ్డుచింతలపల్లి చెరువు నుంచి అనుమతి లేకుండా మొరం తరలిస్తున్న విషయంలో పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి ఎలాంటి సంబంధం లేదని, బీజేపీ నాయకుల ఆరోపణలు అవాస్తవమని ఎమ్మార్పీఎస్(టీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేదాసి మోహన్ అన్నారు. శనివారం బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి బొడ్డుచింతలపల్లి చెరువు ప్రాంతాన్ని పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. గ్రామ అవసరాల కోసం చెరువు నుంచి మొరం తరలిస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి మాటలు నమ్మొద్దన్నారు. సర్పంచ్ కేదాసి అనిల్, బీఆర్ఎస్ నాయకులు కేదారి భాస్కర్, కాటి సుందరయ్య, మారెడుగొండ రాజు, కూనమల్ల చిరంజీవి, కనుకుంట్ల సాంబయ్య, గోపగాని దేవేందర్, తుమ్మనపెల్లి రవి, కనుకుంట్ల రవి, ముద్రబోయిన నరేశ్, కేదాసి ప్రేమ్ పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ అందించాలి



నర్సంపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



సంగెం: మాట్లాడుతున్న ఇస్మాయిల్

నర్సంపేట : రైతులకు అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ అందించాలని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో యాసంగి నాట్లు వేసుకోవడం జరుగుతుందని, పలు చోట్ల విద్యుత్ సమస్యలు ఏర్పడుతున్నాయని రైతులు తమ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. సాగు పూర్తయ్యేంత వరకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గతంలో విద్యుత్ సమస్యలు ఏర్పడితే నూతన సబ్‌స్టేషన్లు మంజూరు చేయించి పరిష్కరించడం జరిగిందన్నారు. ఇప్పటికే విద్యుత్ శాఖ సీఎండీతో మాట్లాడామని, అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కలిసి నాణ్యమైన విద్యుత్ అందించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఈ ఎస్.సదానందం, ఏడీఈలు అమ్రు నాయక్, చలపతిరావు, ఏఈలు శ్రీధర్, మచ్చ ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కష్టాలు తొలగించాలి

సంగెం : యాసంగి పంటల సాగుకోసం రైతులు పడుతున్న విద్యుత్ కష్టాలు తొలగించాలని ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.ఇస్మాయిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో గోనే రాంచంద్రు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారం రోజులుగా కరెంట్ ఎపుడు వస్తుందో, ఎపుడు పోతుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. దీంతో రైతులు ఎండిపోతున్న పంటలను కాపాడుకోలేక ఆందోళన చెందుతున్నారన్నారు. వ్యవసాయానికి త్రీఫేజ్ కరెంట్ సరఫరా ఎప్పుడు వస్తుందో అడిగితే అధికారులకే తెలియదని సమాధానం ఇస్తున్నారన్నారు. ఇదేవిధంగా కరెంట్ కోతలు విధిస్తే పంటలు ఎండిపోయి పెట్టుబడి రాక రైతులు నష్టపోయి ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి వస్తుందన్నారు. రైతుల ఆత్మహత్యలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి విద్యుత్ సరఫరా సమయానుకూలంగా ఇచ్చి రైతులను ఆదుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీను, ఎనబోతుల సాంబయ్య, సోమిడి రవి, రాజేందర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తిహవేలి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవ ప్రచార కరపత్రాలను ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఆవిష్కరించారు. ఫిబ్రవరి 5న స్వామి వారి కల్యాణం నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకులు పురుషోత్తమాచారి తెలిపారు. కమిటీ సభ్యులు సిరిసె రాజేశ్వర్‌రావు, గట్ల భిక్షపతి, వెంకటేశ్వర్లు, కమలాకర్, మొగిలి గ్రామస్తులు పాల్గొన్నారు.

'పాకాల' సందర్శన



గీసుకొండ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం పాకాల సరస్సు, అడవిని సందర్శించారు. వారికి ఫారెస్టు అధికారులు అడవులు, వన్యప్రాణుల రక్షణ, నీటి వినియోగంపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



సంగెం : మండలంలోని మొండ్రాయి గొల్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, ప్లేట్లను జ్ఞాన ఫౌండేషన్ సూర్యపేట వారి ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లేశం, ఎంపీటీసీ కొనకటి రాణి, ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, విద్యా కమిటీ చైర్మన్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అభినందన



రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లి కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయానికి చెందిన విద్యార్థిని టి.దివ్య రూ.10వేల నగదు బహుమతి గెలుపొందినట్లు స్పెషలాఫీసర్ బుర్ర కవిత తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పర్వతగిరి మండలంలోని పర్వతాల శివాలయంలో ఉమ్మడి జిల్లా స్థాయి వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో దివ్య ప్రతిభ కనబర్చి మొదటి బహుమతి రూ .10వేల నగదు అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీల నియామకం



నూతన సభ్యులకు నియామక పత్రం అందజేస్తున్న లక్ష్మణ్

నెక్కొండ : పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్ గై లక్ష్మణ్ అన్నారు. మండలంలోని పెద్దకొర్పోలు శివారు వెంకట్‌తండాలో శనివారం మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ గ్రామకమిటీ, పార్టీ అనుబంధ సంఘాలను ఆయన నియమించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజల ముందుకు తీసుకవెళ్లాలన్నారు. అనంతరం గ్రామ శాఖ అధ్యక్షుడిగా ధరావత్ కిషన్, ఉపాధ్యక్షుడిగా బానోత్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ధరావత్ సుధాకర్, కోశాధికారిగా ధరావత్ వీరు. అలాగే యూత్ అధ్యక్షుడిగా ధరావత్ సంతోష్, ఉపాధ్యక్షుడిగా ధరావత్ లింగన్న, ప్రధాన కార్యదర్శిగా ధరావత్ శంకర్, కిసాన్ సెల్ అధ్యక్షుడిగా వీరు. ఉపాధ్యక్షుడిగా బక్కన్న, ప్రధాన కార్యదర్శిగా సామ్యలతో పాటు ఇతర కమిటీలను నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో రాచకొండ రఘు, బండి శివకుమార్, ఇడంపాక ప్రకాశం, బాదావత్ భీమన్న, సాంబయ్య, జంపాల శ్రీనివాస్, బొడ్డుపల్లి యాదగిరి, బిర్రు కమల్, రాజు, బిర్రు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



నర్సంపేటరూరల్: సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ముత్యాలమ్మతండాలో సీసీరోడ్డు నిర్మాణ పనులను జెడ్పీటీసీ కోమాండ్ల జయగోపాల్‌రెడి, ఎంపీపీ మోతె కళావతి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా సైదా, ఉపసర్పంచ్ రవి, వార్డు సభ్యులు నీల, లక్ష్మణ్, భీమ్లా, శ్రీను, శ్రీనురెడ్డి, సూర్య, కిరణ్, సంజీవ, బాలు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

నల్లబెల్లి : గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యమని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని రుద్రగూడెం గ్రామంలో రూ.40 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గంలో వందశాతం సీసీరోడ్లు ఉన్న గ్రామాలే కనిపిస్తాయన్నారు. రూ.150 కోట్ల నిధులతో ఇంటర్నల్ రోడ్లు మంజూరు అయ్యాయని, వచ్చే రెండు, మూడు నెలల్లో వందశాతం అంతర్గత, లింకేజ్ రోడ్లు పూర్తి అవుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోత్ రామస్వామి, జెడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఊడ్గుల ప్రవీణ్, సర్పంచ్ మల్లాడి కవిత, నాయకులు విజయేందర్‌రెడ్డి, సాంబరెడ్డి, సూరయ్య, శివాజీ, శివకోటి, రాజిరెడ్డి, సారంగపాణి, శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



వర్ధన్నపేట: ఉత్తమ వైద్యులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు



చెన్నారావుపేట: కానిస్టేబుల్ జ్ఞానేశ్వర్‌ను సన్మానిస్తున్న నాయకులు

చెన్నారావుపేట : రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా జిల్లా ఉత్తమ తహసీల్దార్‌గా బన్సిలాల్, ఉత్తమ కానిస్టేబుల్‌గా జ్ఞానేశ్వర్ అవార్డులు అందుకున్నారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు కంది కృష్ణ చైతన్యరెడ్డి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ రఫీతో పాటు పలువురు నాయకులు శనివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో కుసుమ నరేందర్, కందకట్ల సాంబయ్య, మూడు రమేష్, అశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

జాతీయ యువ పురస్కార గ్రహీతకు..

వర్ధన్నపేట : జాతీయ యువ పురస్కార గ్రహీత జక్కి శ్రీకాంత్‌ను శనివారం వర్ధన్నపేటలో తెలంగాణ అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కంజర్ల మహేష్, రాష్ట్ర అధ్యక్షుడు జన్ను నర్సయ్య మాట్లాడారు. నిరంతరం బహుజనవాదిగా అంబేడ్కర్, పూలే, కాన్షీరాం ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లిన వ్యక్తి అని కొనియాడారు. పది సంవత్సరాలుగా శ్రీకాంత్ అంబేడ్కర్ ఆలోచన విధానంతో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల రవీందర్, మంద రవీందర్, గడ్డం కుమారస్వామి పాల్గొన్నారు. అలాగే వర్ధన్నపేట ఉత్తమ వైద్యాధికారిగా అవార్డు అందుకున్న వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహస్వామి, గైనకాలజిస్టు డాక్టర్ సోమశేఖర్‌లను శనివారం కౌన్సిలర్ తుమ్మల రవీందర్, నాయకులు కొండేటి సంపత్, గడ్డం కుమారస్వామి, ఎర్ర శ్రావణ్‌కుమార్, కన్నం కుమార్ శాలువాలతో ఘనంగా సన్మానించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నివాళులర్పిస్తున్న నాడెం శాంతికుమార్

నర్సంపేట రూరల్ : వైఎస్సార్‌టీపీ వరంగల్ తూర్పు నియోజకవర్గం కోఆర్డినేటర్ సునీత్‌కుమార్ నాయనమ్మ రాజమ్మ అనారోగ్యంతో శనివారం మృతిచెందింది. ఆమె మృతదేహంపై వైఎస్సార్‌టీపీ హనుమకొండ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు నాడెం శాంతికుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు నూనె నర్సయ్య, భూక్యా సురేందర్, భూక్యా లాలు, కీసరి రాంబాబు, దినేష్ పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని మనుబోతులగడ్డ సర్పంచ్ వల్లెపు సోమయ్య తల్లి ఎల్లమ్మ శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. కాగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, సొసైటీ వైస్ చైర్మన్ వేణుకృష్ణ, బాలునాయక్, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని పాత మగ్దుంపురం గ్రామానికి చెందిన సుంకరి పెద్ద సారయ్య అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కాగా జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు మహ్మద్ రఫీ, నాయకుల కంది కృష్ణ చైతన్యరెడ్డి, సర్పంచ్ సుంకరి లావణ్య, నాయకులు సాంబయ్య బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆరె కులస్తులకు ఓబీసీ వర్తింపజేయాలి

- రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజి

దామెర : ఆరె కులస్తులకు ఓబీసీ వర్తింపజేయాలని ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజి కోరారు. మండలంలోని ఊరుగొండకు చెందిన శివాజి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు నగరానికి వచ్చిన సందర్భంగా శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. అనంతరం ఆరెకులస్తులకు ఓబీసీ వర్తింపజేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారన్నారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ ఆరె కులస్తులను ఓబీసీ జాబితాలో చేర్చాలని గత కొన్ని సంవత్సరాలు కోరుతున్నామని, ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి తమకు ఓబీసీ వర్తింపజేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర రైతువిమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్ రావు, ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జెండా రాజేష్ తదితరులు ఉన్నారు.

కామాంధులను శిక్షించాలి



ఖిలా వరంగల్: దూపకుంట రోడ్డులోని నిర్జీవ ప్రదేశంలో బాలికపై సామూహిక అత్యాచారం చేసిన ముగ్గురు కామాంధులను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి నలిగంటి రత్నమాల డిమాండ్‌చేశారు. ఈమేరకు ఖిలా వరంగల్ పడమరకోట జంక్షన్‌లో ఐద్వా జిల్లా కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణకు అనేక చట్టాలు వచ్చినా అవి పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని విమర్శించారు. రాజకీయ జోక్యంతో నిర్భయ చట్టం నీరుగారిపోతోందని ఆరోపించారు. ప్రేమపేరుతో బాలికను మోసం చేసి అత్యాచారానికి ఒడిగట్టిన దోషులను చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని సూచించారు.